తప్పితే ఎక్కువలేరు ఆ మీటింగులో. ప్రజాసోషలిస్టు నాయకుడు ప్రసంగించడం మొదలెట్టాడు.

"మేము మొదటినుంచీ మధ్యే మార్గవాదులం. అటు రష్యా, అమెరికా, రెండూ వద్దంటున్నాము. మూడోపంథా కావాలి. ఇది రెంటికీ మధ్యగా పోతుంది. మాది నిజమైన సోషలిజం. ప్రజాసోషలిజం!" అంటూ నాలుగు ముక్కలుచెప్పి వాళ్ళ వాళ్ళు సాగించిన "కరివెన ఇనాం సత్యాగ్రహం" గురించి వర్ణించాడు.

రెండు రోజులైన తర్వాత కమ్యూనిస్టుల పత్రికలో "...గ్రామంలో 2500 మందితో బ్రహ్మాండమైనసభ! గ్రామప్రజల అఖండస్వాగతం" అనే శీర్షికక్రింద "సభలో కాంగ్రెసుమితా విచ్ఛిన్న చర్యలు, సభను భంగం చేయాలని ప్రయత్నం. సభపైరాళ్ళు, చెప్పులు విసరారు" అని వ్రాశారు. "అసలు కాంగ్రెసు మీటింగు కొచ్చింది రెండు వందలు మాత్రమే." అని కూడా వ్రాసుకున్నారు. "ఈమాటు కాంగ్రెసుకి సమాధికడతామనిగ్రామస్థులంతా హామీనిచ్చారు"అని ఇంకా చెప్పుకున్నారు పత్రికలో.

సరిగా అదేరోజు కాంగ్రెసు పత్రికలలో, "...గ్రామంలో వేలమందితో బ్రహ్మాండమైనసభ! కమ్యూనిస్టుల కంచుకోట బ్రద్దలైనది!" అనే శీర్షిక క్రింద "సభలో కమ్యూనిస్టు గూండాలు రౌడీ చర్యలు జరిపారు. ఇద్దరు బాలురతలలు పగిలాయి. ప్రజలు తగినబుద్ధి చెప్పారు. ఈమాటు కాంగ్రెసుకే మా వోటని హరిజనులు కూడ వాగ్దానంచేశారు." అని ఒక "కాలం" వార్త వ్రాసుకున్నారు.

ఆహా! ఎంతవిచిత్రం! నిజానికి రెండు మీటింగులకే హాజరైన జనం సమంగానే వున్నారు. ఐదు వందలు వీళ్ళమీటింగుకీ, ఐదు వందలు వాళ్ల మీటింగుకీ వచ్చారు. రెండు వూరేగింపుల్లోను వచ్చినవాళ్లు వందకంటె ఎక్కువలేరు. గ్రామ ప్రజల్లో ఏ పక్షానికి చెందినవాళ్లు ఆ పక్షానికే స్వాగతం యిచ్చుకున్నారుగాని గ్రామ ప్రజలు మొత్తంగా ఎవళ్లకీ స్వాగతం యివ్వనూ లేదు; రెండేసి వేలమంది నాలుగేసి వేలమంది హాజరు కానూ లేదు; రౌడీచర్యలని చెప్పుకోతగ్గవి జరగనూ లేదు; ఎవరికీ తలలూ పగలనూలేదు, చెప్పులు విసరనూ లేదు; వాలంటీర్ల నినాదాలుతప్ప హాజరైన జనంలో ఎవరూ "మావోటు మీకే యిస్తామని" ఖచ్చితంగా గొంతెత్తి చెప్పనూలేదు.

స్వతంత్ర భారతంలో పార్టీలు,పత్రికలు ప్రజల నెంత స్వతంత్రంగావుపయోగించుకుంటున్నాయ్!

కథానిక

# శిథిలాలయంలో—

"భాస్కరం-ప్రభాకరం"

గదిలోనికి వస్తూనే, "నిజంగా జరిగిన కథచెప్తాను రాసుకోరా" అన్నాడు శేషు.

"అంటే నమ్మాలని నీవుద్దేశ్యం" అన్నాడు టార్జాన్.

"అసలు కథవినండిరా, తరవాత విమర్శించుదురుగాని" అన్నాడు శేషు విసుగ్గా.

"మరి నేవస్తారా, నాకు పనుంది" అని లేవబోయాడు టార్జాన్.

"కూర్చోవోయ్, కథవిని వెళుదుగాని" అని వెంటనే కథ ప్రారంభించాడు శేషు—

* * *

"గోపాలం గతచరిత్ర ఏమంత ముఖ్యమైనది కాదు. స్వతహాగా గోపాలం సరదామనిషి. రెవిన్యూ ఇన్స్పెక్టరు కాగానే పెళ్లాన్ని కాపురానికి తీసుకొచ్చాడు. చీరాలలోవుండగా బుజ్జాయి పుట్టాడు. అక్కడనుంచీ గోపాలం జీవితం మారింది.

బుజ్జాయి అల్లరి అలివిమాలిన అల్లరి. తెల్లటి బుగ్గలూ, తొనలుదేరిన వాళ్లూ, ఎంతో ముద్దుగా వుండేవాడు. ఎప్పుడూ నవ్వుతూ వుండేవాడు. ఎత్తుకున్నాక దింపితే గోలచేసేవాడు. ఎప్పుడూ ఎవరో వొకరు ఎత్తుకోవలసిందే.

ఒకనాటిరాత్రి అకస్మాత్తుగా మృత్యుదేవత బుజ్జిగాణ్ణి ఎత్తుకుపోయింది.

ఇంటి కప్పుమీదనుంచి పెద్దతేలు మంచంమీద పడి, పాలుతాగి పడుకున్న బుజ్జిగాడి కుడిపాదం మీద కుట్టింది. బుజ్జిగాడు స్పృహతప్పి పడి

పోయాడు, నోటంట నురుగులువచ్చాయి. కళ్లు తేలవేశాడు.

డాక్టరుగారొచ్చారు. విషంచాలా తీవ్రమైన దనీ, కుడిపాదం తీసేస్తే ప్రాణాపాయం లేదనీ చెప్పారు. గోపాలం నెత్తిమీద పిడుగులురాలాయి.

బుజ్జిగాడి కుడిపాదం తీయనక్కర లేక పోయింది. ఆస్పత్రికి వెళ్లేదారిలోనే బుజ్జిగాడి ప్రాణాలు పంచభూతాలలో కలిసిపోయాయి.

ఆ దంపతులను పట్టుకోలేకపోయారు ఇరుగు పొరుగు. గోపాలానికి పిచ్చిఎత్తినట్లయింది. జుట్టు పీక్కున్నాడు...ఆవిడకి రెండురోజులు వొంటి మీద స్మృతిలేదు. గంటగంటకీ ఫిట్సు.

రెండురోజులకల్లా మామగారూ, అత్తగారూ వచ్చి భార్యని పుట్టింటికి తీసుకెళ్లారు. గోపాలం ఆ యింట్లో వుండలేకపోయాడు. బుజ్జిగాడు ఆయింట్లో ప్రతి అంగుళంలోనూ కనుపిస్తున్నాడు. నెల్లాళ్ళు సెలవుపెట్టి తన స్వగ్రామం వెళ్లాడు, సీతారామయ్య బావయింటికి.

గోపాలం కళ్ళలో యింకా బుజ్జిగాడు పకపక నవ్వుతూనే వున్నాడు. చెవుల్లో ముద్దుమాటలు పలుకుతూనే వున్నాడు. గోపాలం మనస్సులో బుజ్జాయి కుర్చీ వేసుకు కూర్చున్నాడు.

“అయినా ఇండియాలో శిశుమరణాలెక్కువరా. అంతపట్టించుకో కూడదు. నువ్వూకూడా చస్తావా ఏమిటి?... నీ మొహంలావుంది...పుత్ర శోకం బాధేననుకో కాని మరిచిపోవాలోయ్ కొంత! ‘జాతస్య మరణం ధ్రువమ్’అన్నారుపెద్దలు. మన కరణంగారినిచూడు! చెట్టంత కొడుకు పోయాడు! బెంగెట్టుకోలేదు సరిగదా, మనువర్తి వ్యాజ్యాల లిటిగేషన్లు చక్కబెడుతున్నాడు! అదీ స్పిరిట్!” అంటూ స్నేహితులంతా వూరుకోబెట్ట సాగారు.

‘వాడు కాస్త కోలుకోవాలి. మళ్ళీ మనుష్యుల్లో కలవాలంటే ఆ చావునుంచి పీడిమనస్సు మళ్లించాలి’ అని సాయంకాలంవేళ షికార్లు తిప్పటం ప్రారంభించారు. ఓమాటు కాలవగట్టుకీ, మరోమాటు రైలు కట్టకీ, ఇంకోమారు వంతెన దగ్గరకీ అల్లాఅల్లా షికార్లు తిప్పేవారు.

సాయంకాలం షికార్లు అలవాటయాయి గోపాలానికి. వాళ్ళతోపాటే నడుస్తూ ఏదో పరధ్యానంగా వుండేవాడు. సాయంకాలమైతే తనకు తానే బయల్దేరేవాడు‘షికారుకెడదామా?’అంటూ.

పక్కవూళ్ళోకి మంచి సినిమా వచ్చింది చూద్దాం రమ్మన్నాడు జానకిరామయ్య. గోపాలం రానన్నాడు. యాక్టర్లగురించీ, సినిమా గొప్పదనం గురించీ చిన్న లెక్చరిచ్చి చూశారు. ససేమిరా. “పోనీలే నీయిష్టం, మేం పోతాం” అన్నారు. సరే నన్నాడు. వాళ్ళు చక్కాపోయారు.

సాయంకాలం షికారువేళ అయింది. గోపాలం ఒక్కడే బయలుదేరాడు. పరధ్యానంగా నడుస్తున్నాడు. కాలవ గట్టుమీదకొచ్చాడు.

“రండి బాబూ” అన్నాడు కాలవగట్టుదగ్గర బల్లకట్టు వీరాస్వామి.

సమాధానం చెప్పకుండా ఆలోచిస్తూ బల్లకట్టు మీదకొచ్చాడు. యాంత్రికంగా దిగినడుస్తున్నాడు.

వంతెన దరిదాపులకొచ్చాడు.

ఎక్కడా మనుష్యసంచారంలేదు.

ఇటు కాలవా, అటు మామిడితోపు, మధ్య కాలవగట్టు. మామిడితోపు అవతల కొన్ని పాడుబడ్డ పూరికొంపలు...దూరంగా ఏదో పాతగుడి.

సాయంకాలం పడింది. హఠాత్తుగా పిల్లాడేడుస్తున్నట్టు వినబడింది.

గోపాలం మనస్సు గిలగిల కొట్టుకుంది. భ్రాంతి కాదుకదా?...కాని ఎటో ఏడుపు వినిపిస్తోంది... బుజ్జాయి పాలకోసం ఏడిచినట్టు...గుడివైపునుంచి వినబడుతోంది.

గోపాలం తోటకడ్డంపడి పరుగెత్తాడు.

దూరంగా పాడుపడ్డ దేవాలయం శిథిలమై, అర్చనా, పూజారీ, భక్తులూ, నైవేద్యాలూలేక... వొంటరిగా...సాయంకాలం... శిథిలాలయం...

గోపాలానికి తొందర ఎక్కువయింది.

తలుపులు తెరవవలసిన బాధలేకుండా, దేవాలయానికి తలుపులే లేవు!...లోపల గర్భగుడిదాకా వెళ్ళాడు.

సాయంకాలం అస్తమిస్తున్న సూర్యుడి సంజ కాంతి నారింజరంగులు లోపల విగ్రహాలమీద కొద్దిగా పడుతున్నాయి...రాతిలో పొదిగిన గాజు కన్నులమీద సూర్యకాంతులుపడి, రాతిబొమ్మల మొహాలలోకి జీవకళ తెచ్చాయి.

గోపాలానికి ఒక యేడాది పిల్లాడి రాతిబొమ్మ కనిపించింది.

అది బుజ్జిగాడి బొమ్మలా అనిపించింది.

ఇందాక ఏడిచింది వీడేనేమో అనుకున్నాడు.

కాంతులవల్ల కాబోలు కళ్లంట నీరు కారుతున్నట్టూ కన్ను లెర్రబడ్డట్టూ తోచింది.

గోపాలం చాలా కలవరపడ్డాడు. అచ్చం బుజ్జిగాడిలావున్నదా బొమ్మ... బుజ్జాయి. తన పుట్టినరోజు పదిరోజు లుందనగా అమ్మనూ నాన్ననూ వదిలిపోయాడు. సరిగ్గా అంత పొడుగే వుంది బొమ్మ.

"ఏడుస్తున్నావా బుజ్జాయ్?" అన్నాడు లాలనగా.

బుజ్జాయి మాట్లాడలేదు.

"బుజ్జాయి... బుజ్జాయి..."అని గొణుక్కున్నాడు. బొమ్మదగ్గర కూర్చుని బొమ్మని నిమురుతున్నాడు.

క్రమంగా చీకటిపడింది...కండువా దులుపుకుని లేచి నుంచున్నాడు గోపాలం. ఇంటికి తిరిగి వచ్చేస్తున్నాడు.

"ఇంత సాయంకాలంవరకూ ఈయనేం జేస్తున్నాడబ్బా!" అనివీరాస్వామి ఆశ్చర్యపోయాడు.

గోపాలం ఇల్లు చేరుకున్నాడు.

* * *

గోపాలం రోజూ పాడుగుడికి పోతున్నాడు. స్నేహితులంతాచెప్పి చూశారు. "నీ బుజ్జిగాడు కాదురా, అది కుమారస్వామి గుడిరా, అందులో బొమ్మలుండేవిరా, పిల్లలబొమ్మలు చాలావుంటాయిరా, నీకేమన్నా పిచ్చేమిటిరా" అని శతవిధాల మందలింప జూశారు.

ఈ మాటలేమీ గోపాలం పట్టించుకోలేదు. బుజ్జిగాణ్ణి చూసుకుందుకు రోజూ వెళ్ళటం మానలేదు.

తన బుజ్జాయే బొమ్మయిపోయాడని విశ్వాసం గోపాలానికి... తను చూస్తూండగా భూగర్భంలో కలిసిపోయిన బుజ్జాయే గుళ్లోవున్నాడని నమ్మకం గోపాలానికి.

* * *

రెండు రోజులనుండీ గోపాలానికి లంఖణాల జ్వరంవచ్చింది. "బుజ్జాయ్,... నాన్న... బుజ్జీ" అని ఒకటే కలవరింతలు!... రోజూరాత్రి శేఖరం, జానకిరామయ్యా పడుకుంటున్నారు గోపాలం గదిలో.

రాత్రి పదకొండయింది... వెన్నెల... బహుళ పంచమిజ్యోత్స్న ... నిద్దర రావటంలేదు ... గోపాలానికి ఆలోచనలతో తల పగిలిపోతోంది.

ఈ వేళ పంచమీకదూ! అన్నట్టు ఈవేళ బుజ్జాయి పుట్టినరోజు! రాత్రి పన్నెండు గంటలప్పుడు బుజ్జిగాడు క్యారుమన్నాడు!

గోపాలానికి బుజ్జాయి ఏడుపు వినబడింది.

తనకోసం తన బుజ్జిగాడు ఏడుస్తున్నాడు. తనిక్కడ వుండలేడు. బుజ్జిగాడిదగ్గరికి పోవాలి.

గోపాలం లేచి కూర్చుని అటూ యిటూ చూశాడు. శేఖరం, జానీగాడు ఇద్దరు నిద్దరోతున్నారు. గోపాలం లేచి బుజ్జిగాడికోసం పరుగెత్తటం ప్రారంభించాడు. 'కాలవదగ్గర బల్లకట్టు, అవతలగట్టున వుంది. వీరాస్వామి లేడు. గోపాలం కాలవకడ్డం పడ్డాడు. మధ్యలో కొద్దిగా ఈదవలిసొచ్చింది. తడిబట్టలతో కాలవగట్టున పరుగెత్తాడు.

గర్భగుడిదాకా పరుగెత్తాడు.

ఆలయంలో బొమ్మలేదు.

గోపాలం కళ్లునులుపుకుని చూశాడు బుజ్జిగాడి. బొమ్మ లేదు!... వెన్నెట్లో మిగతా బొమ్మలు కనబడుతున్నాయి. బుజ్జిగాడి బొమ్మ లేదు... ఏమయ్యాడు?... బుజ్జాయి ఏడీ?

గుండెలు చేత్తోపట్టుకుని 'బుజ్జాయ్' అని కేకలు పెడుతూ ఊరివైపు పరుగెత్తుకు వస్తున్నాడు.

అప్పుడే కాలవదాటి చెరో లాంతరూ పట్టుకుని తనవైపు వస్తున్నారు జానీ, శేఖరం.

"శేఖరం! బుజ్జాయి లేడు! బుజ్జాయి మాయమయ్యాడు!. నా బుజ్జాయి మనింటికొచ్చాడా?" పిచ్చికేకలు పెడుతున్నాడు గోపాలం.

"ఒరేయ్, గోపాలం! జ్వరంలో యేమిట్రా నీ అఘాయిత్యం? బట్టలన్నీ తడిసిపోయాయి. బతకాలని లేదా ఏమిటి? ఇంకా బుజ్జాయి అంటా వేమిట్రా? ఇంటికి పద!" అని కేకలేశాడు శేఖరం

గుళ్ళో బుజ్జాయి మాయమయ్యాడు జానీ... బుజ్జాయి మనింటి కొచ్చాడా? గుళ్ళో లేకుండా పోయాడు" రొప్పుతున్నాడు గోపాలం.

జానకిరామయ్యా, శేఖరం వొకరినొకరు చూసుకున్నారు.

"గోపాలం పద, గుడిలో చూద్దాం. అక్కడుండక ఎక్కడికి పోతాడు? సరిగ్గా నువ్వు చూడలేదేమో! పద!"

గోపాలం వాళ్ళిద్దరితో పాడుగుడికి వెళ్లాడు వణికిపోతూ.

"ఇదిగో నీ బుజ్జాయి! ఎక్కడికో పోయాడని వూరికే గోలచేశావు. జ్వరం సంగతి తెలుసుకదా, తిరగబెడుతుందిరా బాబూ అంటే వినవేం... ఇదిగో బొమ్మ చూడు."

గోపాలం తన కళ్ళు తను నమ్మలేకపోయాడు. ఒకటిమాత్రం నిజం. తను ఇందాకా చూసినప్పుడు అక్కడ బొమ్మలేదు. ఇప్పుడు వుంది. ఇందులో ఏదో కిటుకు వుంది. లేకపోతే అన్ని బొమ్మలూ కనబడి, ఇది కనబడకపోవడమేం? వీళ్ళు తను నిజం చెప్పినా నమ్మరు. పైగా పిచ్చి అనీ, ఆలోచన ఎక్కువైతే అలాగేవుంటుందనీ అంటారు.

"సరిగ్గా చూడు!...నీ బుజ్జిగాడేనా?" అని అన్నాడు జానకిరామయ్య లాంతరు బొమ్మ దగ్గరగా పెట్టి.

ఆప్యాయంగా పరీక్షగా బొమ్మను చూసుకుంటున్న గోపాలం గతుక్కుమన్నాడు.

బుజ్జాయిబొమ్మ కుడికాలికి పాదంలేదు!

గోపాలం తల గిర్రున తిరిగింది. పాత విషాద స్మృతులన్నీ వుప్పెనగా విరుచుకుబడ్డాయి. డాక్టరుగారు ఆ పాదమే తీసెయ్యమనడం, తను హడలిపోవడం, హాస్పిటలుకెళ్ళే దారిలోనే బుజ్జిగాడి వొళ్ళు చల్లబడడం అన్నీ సినిమాలాగా గబగబా కళ్ళముందు తిరిగాయి.

"శేఖరం, జానీ, చూడండి. బుజ్జాయి కుడికాలి పాదం లేదు! డాక్టరు తియ్యాల్సిన పాదం...! బుజ్జాయ్! నీ పాదం ఏది నాన్నా? ఇందాకా ఎక్కడికెళ్ళావు బాబూ, బుజ్జాయ్!"

జానకిరామయ్యా, శేఖరం మళ్ళా వొకరొకరు చూసుకున్నారు.

"గోపాలం, ఇంటికి పద... బొమ్మ చూపిస్తే స్థిమితపడతావని తీసుకొచ్చాం. కుడిపాదం లేదు మొర్రోమని నువ్విలా గోలచేస్తే ఎల్లాగ? ఇంటికి పోయి పడుకుందాం పద! అర్థరాత్రి సమయంలో, ఇలా బట్టలన్నీ తడిపేసుకుని, ఇలా కేకలు పెడుతూంటే, నీ జ్వరం ఏమన్నా తగ్గాలా? చూస్తే పిచ్చెక్కేలా వుంది!" అని కేకలేశాడు జానకిరామయ్య.

గోపాలానికి గత్యంతరం కనబడలేదు. తనకి ఆలోచించడానికి శక్తిపోయింది. తనమీద తనకే విశ్వాసంపోయింది. బొమ్మ హఠాత్తుగా మాయం కావడమేమిటి? కుడిపాదం లేకపోవడం ఏమిటి? ఏమో...ఏమో...

ఇద్దరి బుజాలమీదా చెరో చెయ్యీ వేసుకుని, మెల్లిగా యింటికిచేరాడు గోపాలం. తడిబట్టలు విడిచి పొడిబట్టలు కట్టుకున్నాడు. "పడుకోమరి కళ్లుమూసుకుని. బ్రోమైడు మిక్చరు తెస్తాను ఆచారిదగ్గర...నిద్రపడుతుంది"అన్నాడు శేఖరం.

ఇంకేమీ తలుచుకోకుండా నిద్రపోవాలనుకున్నాడు గోపాలం. మంచందగ్గరకెళ్ళాడు—

మంచంవైపు పరీక్షగా చూశాడు.

కెవ్వుమని అరిచి విరుచుకు పడిపోయాడు గోపాలం.

పక్కమీద రాతితో చెక్కిన పసిపిల్లాడి కుడికాలి పాదం వున్నది.

* * *

"అదక్కడకెలా వచ్చింది?" అని అడిగాను ఆదుర్దాగా.

"నాకు తెలియదు"అని లేచిపోయాడు శేషు.

"ఇమాజినేషన్‌రా"అన్నాడు టార్జాన్.

అంతా ఊహాగానమేనా? ఏమో! నాకను మానమే!

---

ఒక జోరీగవచ్చి ఒక ఎద్దుకొమ్ము మీద కూర్చుంది కొంచెంసేపయాక ఇంక పోతే బాగుండుననుకొని "ఇక నేపోనా?" అని అడిగింది. దానికి ఎద్దు "నీరాక నేచూడలేదు. నీ పోవడమూ నేచూడను" అంది నీతి: కొందరువ్యక్తులు ఎంతటి అల్పులంటే, వారెక్కడవున్నా లేకున్నా ఒకటే; వుండి మంచి చేయలేరు; లేక చెడూ చేయలేరు.—(ఈసబ్ నీతికథావళి.)